ప్రజాశక్తి
శుక్రవారం 8 మార్చి 2024 | 5 | అనంతపురం

## 1,20,347 మందికి వైఎస్ఆర్ చేయూత

మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ ఎం.గౌతమి తదితరులు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

జిల్లాలో వైఎస్సార్ చేయూత పథకం కింద 1,20,347 మంది మహిళలకు రూ.225.65 కోట్ల లబ్ధి చేకూర్చినట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలియజేశారు. కలెక్టర్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి చేయూత పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరుసగా నాలుగో ఏడాది వైఎస్సార్ చేయూత పథకం సాయాన్ని మహిళలకు ప్రభుత్వం అందిచిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు రూ.225.651 కోట్ల మెగా చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ ఛైర్‌పర్సన్ మంజుల, ఎడిసిసి బ్యాంక్ ఛైర్‌పర్సన్ లిఖిత, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఉమాదేవి, డీఆర్డీఏ పీడీ నరసింహా రెడ్డి, మెప్మా పీడీ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

# అ తివా.. ధికారం ఎక్కడ..!

◆ 72 ఏళ్లలో 11 మందే చట్టసభలో అడుగు ◆ అదీ రిజర్వు స్థానాల్లోనే అధికం

**నేడు మహిళా దినోత్సవం**

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

అతివ ఇప్పుడు అన్ని రంగాల్లోనూ రాణిస్తోంది. పురుషుడితో సమానం అని చెప్పుకుంటున్నప్పటికీ ఆచరణలో అది ఏ మాత్రం కాదన్నది నిష్టూర సత్యంగానే ఉంటోంది. ప్రజాస్వామ్యంలో అత్యంత ప్రధానమైన చట్టసభల్లోకి ఇప్పటికీ అడుగు పెట్టిన వారు నామమాత్రమనే చెప్పాలి. దేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత 1952 నుంచి ఎన్నికలు జరుగుతూ వస్తున్నాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు చూస్తే 72 సంవత్సరాల కాలం అవుతోంది. ఈ సుదీర్ఘ కాలంలోనూ అతివలు చట్టసభల్లో అడుగు పెట్టింది తక్కువనే చెప్పాలి. చట్టసభలకు సంబంధించి ఉమ్మడి అనంతపురం జిల్లా వరకు చూస్తే 72 సంవత్సరాల కాలంలో ఇక్కడి నుంచి అసెంబ్లీలో అడుగు పెట్టిన మహిళలు కేవలం 11 మంది మాత్రమే కావడం గమనార్హం. అది కూడా అసెంబ్లీ వరకే పరిమితమై ఉన్నారు. లోక్‌సభలో జిల్లా నుంచి అడుగు పెట్టిన మహిళ ఒక్కరంటే ఒక్కరు లేరు. పోటీ చేసిన దాఖలాలు కూడా కనిపించలేదు.

**రిజర్వు స్థానాల్లోనే అత్యధికం**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఇందులో 2009 పునర్విభజన సమయంలో నియోజకవర్గ స్వరూపాల్లో మార్పు జరిగినప్పటికీ సంఖ్యలో మార్పులేవు. ఇందులో నుంచి చూసినప్పుడు తొమ్మిది మంది మహిళలు ఎమ్మెల్యేలుగా ఎన్నికై అసెంబ్లీలో అడుగుపెట్టిన వారున్నారు. ఇందులో ఒక్క శింగనమల ఎస్సీ రిజర్వు నియోజకర్గం నుంచే నలుగురు ఉన్నారు. మొదట రుక్మిణీదేవి కాగా తరువాత శమంతకమణి ఎన్నికయ్యారు. ఆమె మంత్రిగానూ పనిచేశారు. ఆ తరువాత ఆమె కూతురు యామినిబాల ఎమ్మెల్యేగా ఎన్నికైన వారిలోనున్నారు. 2019లో జొన్నలగడ్డ పద్మావతి ఎన్నిక అయ్యారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం కూడా ఎస్సీ రిజర్వు ఉండగానే ఎం.లక్ష్మీదేవి, శారదాంబలు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అన్‌రిజర్వుడు అయ్యాక 2019 ఎన్నికల్లో ఇక్కడి నుంచి ఉషచరణ్ శ్రీ ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రి అయ్యారు. మడకశిర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బి.లక్ష్మీదేవి ఒకసారి, హిందూపురం నుంచి మరోసారి ఎన్నికయ్యారు. ఇక ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జి.జయలక్ష్మమ్మ ఒకసారి ఎన్నికయ్యారు. 2005లో పరిటాల రవీంద్ర హత్యగావించబడ్డాక అనూహ్యంగా ఆయన భార్య పరిటాల సునీత మొదట పెనుకొండ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. నియోజకవర్గాల పునర్విభజన తరువాత కొత్తగా ఏర్పాటైన రాప్తాడు నియోజకవర్గం నుంచి 2009, 2014లో గెలుపొందారు. మంత్రిగానూ పనిచేశారు. గుంతకల్లు నియోజకవర్గం నుంచి గాదె నీలావతి ఎన్నిక అయ్యారు. ఆయన తండ్రి గాదెలింగప్ప హత్య గావించబడిన తరువాత 2004 ఎన్నికల్లో ఆమె అక్కడి నుంచి ఎమ్మెల్యే గెలుపొందారు.

**పార్లమెంట్‌కు నిల్**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురం, హిందూపురం పార్లమెంటు నియోజకవర్గాలున్నాయి. వీటికి 17 సార్లు ఎన్నికలు జరిగాయి. వీటిల్లో ఏ ఒక్క ఎన్నికల్లోనూ మహిళలు పోటీ చేసి పార్లమెంటు సభ్యులుగా ఎన్నికైన దాఖలాల్లేవు. పోటీకి అవకాశం దక్కిన దాఖలాలు కూడా లేవు.

**వచ్చే ఎన్నికల్లోనైనా తగిన ప్రాధాన్యత లభించేనా**

అతివలక అందలమెక్కించడమే తామంటే తాము ముందున్నామని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి ప్రకటనలు చేస్తుంటాయి. అయితే ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఏ మేరకు వారికి అవకాశం కల్పించనున్నారన్నది చర్చ నడుస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకు చూస్తే వైసిపి ఒకరికి చోటు కల్పించగా, టిడిపి ఇద్దరికి అవకాశం కల్పించింది. పార్లమెంటుకు హిందూపురం స్థానానికి వైసిపి తొలిసారిగా మహిళా అభ్యర్థిని ప్రకటించింది.

# అనంతను అభివృద్ధి చేశాం

◆ కరువు జిల్లాకు కార్ల పరిశ్రమ తెచ్చాం
◆ విజన్‌లేని నాయకుడు జగన్మోహన్‌రెడ్డి
◆ రెండు నెలల్లో వైసిపి పతనం ఖాయం
◆ శంఖారావంలో నారా లోకేష్

పెనుకొండ శంఖారావం కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి శ్రేణులు



రెడ్ బుక్ చూపిస్తూ మాట్లాడుతున్న నారా లోకేష్

**ప్రజాశక్తి-హిందూపురం, మడకశిర, పెనుకొండ**

కరువుకు నిలయం అయిన అనంతపురం జిల్లాను టిడిపి పాలనలో అన్ని విధాలా అభివృద్ధి చేశామని టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా లోకేష్ తెలియజేశారు. నారా లోకేష్ చేపట్టిన శంఖారావం 2వ విడత యాత్ర శ్రీ సత్యసాయి జిల్లాలో ప్రారంభం అయ్యింది. గురువారం నాడు శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం, మడకశిరలో బహిరంగ సభలు నిర్వహించారు. రాత్రి పుట్టపర్తి నియోజకవర్గంలో బస చేశారు. బహిరంగ సభల్లో నారా లోకేష్ మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయానికి అనేక విధాలుగా ప్రోత్సాహం అందించామన్నారు. కరువు జిల్లాలో ఏకంగా కార్లు తయారుచేసే పరిశ్రమ తీసుకువచ్చిన విజనరీ నాయకుడు చంద్రబాబు నాయుడు అన్నారు. కియా అనుబంధ సంస్థల ద్వారా 50 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఐదేళ్లలో 1.30 లక్షల మంది రైతులకు 90 శాతం సబ్సీడీ ద్వారా డ్రిప్ ఇరిగేషన్‌ను అందించి అనంతను హార్టికల్చర్ హబ్ గా తీర్చిదిద్దామన్నారు. ఒకే సంవత్సరంలో ఇన్‌పుట్ సబ్సీడీ ద్వారా రూ.2వేల కోట్లు రైతులకు అందిచామని తెలియజేశారు. హంద్రీ-నీవా ప్రాజెక్టు ఫేజ్-2, హెచ్ఎల్‌సి హైలెవన్ మెయిన్ కెనాల్, మిడ్ పెన్నా సౌత్ కెనాల్, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్, ధర్మవరం బ్రాంచ్ కెనాల్ పనులు తెలుగుదేశం పార్టీ పాలనలోనే జరిగాయన్నారు. వైసిపి అధికారంలోకి రాగానే అనంత అభివృద్ధి ఆగిపోయింద న్నారు. అనంతపురం జీవనాడిగా ఉన్న డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని రద్దు చేసి రైతులను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కరువులోకి నెట్టేశాడ న్నారు. కరువులో చిక్కుకుని రైతులు పంటల నష్టపోయినా కనీసం ఇన్ పుట్ సబ్సీడీ ఇవ్వడానికి కూడా ముఖ్యమంత్రికి చేతులు రావడం లేదని ఎద్దేవా చేశారు. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనను సాగిస్తోందన్నారు. ఎలాంటి విజన్ లేని వ్యక్తి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. గంజాయిలో, ఇసుక, మద్యంలో అక్రమాలకు పాల్పడుతూ డబ్బులను దోచుకోవడంలో ఆయనకు విజన్ ఉందన్నారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రంలో మూడు ముక్కలాట ఆడుతున్నారన్నారు. బాబాయ్ వివేకానంద రెడ్డిని చంపింది ఎవరు..? చంపించిందెవరు..? సూత్రధారులు, పాత్రధారులు ఎవరు..? అన్న వాటిపై ఇంతవరకు విచారించక పోవడంలో ముఖ్యమంత్రి ఆంతర్యం ఏమిటంటూ స్వయానా ఆయన చెల్లి సునీత సంధిస్తున్న ప్రశ్నలకు జగన్మోహన్‌రెడ్డి సమాధానాలు చెప్పాలన్నారు. జగన్మోహన్‌రెడ్డికి ఓటు వేయొద్దని ఆయన చెల్లెలు చెబుతోంది అంటే జగన్మోహన్‌రెడ్డి ఎలాంటి వారో అర్థం చేసుకోవాలన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే అనంతపురం జిల్లా అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. హిందూపురాన్ని మోడల్ పట్టణంగా తీర్చిదిద్దు తామన్నారు. లేపాక్షిలో పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకువచ్చి స్థానికులకు ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని తెలియజేశారు. టీడీపీ-జనసేన మధ్య చిచ్చుపెట్టేందుకు వైసిపి పేటీఎం బ్యాచ్ చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బాబు సూపర్ సిక్స్ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి బుద్ధి చెప్పి టిడిపికి ఓటేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బికె.పార్థసారధి, మడకశిర మాజీ ఎమ్మెల్యే ఈరన్న, మడకశిర, పెనుకొండ టిడిపి అభ్యర్థులు సునీల్‌కుమార్, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్, నియోజక వర్గ ఇన్‌ఛార్జి ఆకుల ఉమేష్, ఒక్కలిక సంఘం రాష్ట్ర కన్వీనర్ వి.ఎం.పాండురంగప్ప, జిబి.సుధాకర్‌తో పాటు టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలను రక్షిద్దామంటూ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

## మహిళా సాధికారతకు కృషి చేయాలి

**కలెక్టర్ ఎం.గౌతమి**

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

మహిళా సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో గురువారం నాడు ఏపీజేఏసీ, అమరావతి మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుటుంబంలో మహిళకు తల్లి సహకారం అవసరమన్నారు. మహిళల అభివద్ధికి సాధికారత అవసరమని, ప్రతి ఒక్క మహిళ చక్కగా చదువుకోవాలన్నారు. విద్య అనేది స్వేచ్ఛ ఇస్తుందని, ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. మహిళ ఆర్థికంగా స్వతంత్రంగా ఉండాలని, ఇందుకోసం కష్టపడి పని చేయాలన్నారు. ఉద్యోగం చేస్తున్న మహిళలకు చాలా సవాళ్లు ఎదురవుతాయని, అందుకు మహిళలు సిద్ధంగా ఉండాలని, చాలా బలంగా నిలబడాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారులతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డిఆంనొ జి.రామకృష్ణారెడ్డి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, మెప్మా పీడీ వేణుగోపాల్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బు కొఠారి, డీఎల్డీవో ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆనంతపురం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సమీపంలోని కెఎస్ఎన్ డిగ్రీ కాలేజ్‌లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురువారం ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ బిఎన్.శ్రీదేవి అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు నగరపాలక సంస్థ మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

**ఎన్నికల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెన్నెల శీను**

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెన్నెల శీను

**ప్రజాశక్తి-శింగనమల**

రాబోయే అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజల సహకరించాలని ఎన్నికల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెన్నెల శీను కోరారు. గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శింగనమల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఆరు రెవెన్యూ మండలాల్లో 293 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందుకోసం 293 బూత్ లెవెల్ అధికారులను నియమించామన్నారు. నియోజకవర్గంలో 2,44,913 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఆరు మండలాల్లో మొబైల్ వ్యాన్ తిరిగి డెమో ఇవిఎంతో అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. సెక్టార్ ఆఫీసర్లు, పోలీసు అధికారులతో రెండుసార్లు సమన్వయ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల వద్ద నామినీక్లేచర్ రాయించడం పూర్తయిందన్నారు. 85ఏళ్లు దాటి, మంచాన ఉంటూ కదల్లేని స్థితిలో ఉన్న వారికి హోమ్ ఓటింగ్ సదుపాయంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఇకపోతే సిఆర్‌పిసి 110 కింద నమోతైన 78 బైండోవర్ కేసులను సమీక్ష చేసినట్లు వివరించారు. క్రిటికల్ లొకేషన్స్‌ను గుర్తించి వీడియోగ్రఫీ, వెబ్ కాస్టింగ్, మైక్రో అబ్జర్వర్ల ద్వారా పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. కంట్రోల్ రూం, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి డ్యూటీలు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో శింగనమల డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌రావు, ఎన్నికల ఇడిటి రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ వెంకట్రామిరెడ్డి, బుక్కరాయసముద్రం, శింగనమల, నార్పల, పుట్లూరు, యల్లనూరు, గార్లదిన్నె తహశీల్దార్లు, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

## దళితులు సాగు చేసుకున్న భూములకు పట్టాలివ్వాలి

**సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బాలరంగయ్య, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి**

ఆందోళన చేస్తున్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

**ప్రజాశక్తి-ఉరవకొండ**

దళితులు సాగు చేసుకుంటున్న భూములకు దళితులకే సాగు హక్కు పట్టాలివ్వాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బాలరంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సిపిఎం కార్యాలయం నుంచి ర్యాలీగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద చేరుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూడేరు మండలంలోని సర్వేనెంబర్ 535లో దళితులు, గిరిజనులు, మైనార్టీలు సాగు భూములు లేని పేదలు 40ఏళ్ల నుంచి కొండల్లో పెద్దపెద్ద చెట్లను తొలగించి సాగు చేసుకుంటున్నారన్నారు. సాగు చేసుకుంటున్న వారికే పట్టాలు ఇవ్వాలని రెవెన్యూ, అధికారులకు అనేకసార్లు అర్జీలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఆందోళనలు చేసినప్పుడు మాత్రం పట్టాలిస్తామని హామీ ఇవ్వడమే తప్ప చేసిందేమీ లేదన్నారు. ఈనేపథ్యంలో బుధవారం దళితులు సాగు చేసుకునే భూమిలో వైసీపీ నాయకులు జగనన్న మూడవ కాలనీ పేరుతో ఆక్రమించుకుని పేదల కడుపు కొట్టాలని చూశారన్నారు. ఇందుకు వ్యతిరేకంగా ధర్నా చేస్తే తహశీల్దార్ కార్యాలయంలో కనీసం అర్జీ తీసుకునే నాథుడే లేడన్నారు. దీనికితోడు అక్కడున్న వీఆర్వోలు అవమానపరిచే పద్ధతిలో మాట్లాడటం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సాగు చేసుకుంటున్న వారికే పట్టాలు ఇవ్వాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటేశు, ఎస్.కరీం, మల్లికార్జున, వీరప్ప, ఎర్రిస్వామి, చిన్న ఈశ్వరయ్య, చిదంబరమ్మ, రామలక్ష్మమ్మ, లక్ష్మీదేవి, రైతు కూలి సంఘం జిల్లా కోశాధికారి రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## 9న వైసిపి విస్తృత స్థాయి సమావేశం

**జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య**

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పైలా, మెట్టు, తదితరులు

**ప్రజాశక్తి-రాయదుర్గం**

ఈ నెల 9వ తేదీ పట్టణంలోని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మెట్టు గోవింద్‌రెడ్డి నివాసం వద్ద నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షులు పైలా నరసింహ య్య తెలిపారు. పట్టణంలోని మెట్టు నివాసం వద్ద గురువారం పైలా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరవుతారన్నారు. క్యాడర్‌ను ఎన్నికల కు సమాయత్తం చేయడం, సిఎం జగన్ సందేశాన్ని తెలిపి వారిలో ఉత్తేజం నింపడమే సమావేశం ముఖ్య ఉద్దేశం అన్నారు. దెందులూరు, భీమిలి, రాప్తాడు 'సిద్ధం' సభలను చూసి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ వెన్నులో వణుకు పుట్టిందని, ఓటమి భయం భయంతో అపవిత్ర పొత్తుకు తెరతీశారని తెలిపా రు. డర్టీ పాలిటిక్స్ నడుపుతూ బిజెపితో పొత్తుకు వెంపర్లాడుతున్నారని విమర్శించారు. చంద్రబాబుకు ఎన్నికల ముందు మాత్రమే బిసిలు గుర్తుకు వస్తారన్నారు. వైసిపి పాలనలో బిసిల ఆత్మగౌరవం పెరిగిందన్నారు. జిల్లా పరిశీలకులు ఎంఆర్‌సి రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మెట్టు గోవిందరెడ్డిని, ఎంపిగా శంకరనారాయణను గెలిపించాలని కోరారు. మెట్టు మాట్లాడుతూ నియోజక వర్గంలో 98 శాతం మంది ప్రజలు జగన్, వైసిపికి మద్దతుగా ఉన్నారన్నారు. సమావేశంలో నియోజక వర్గ పరిశీలకులు పామిడి వీరాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, మండల కన్వీనర్లు లక్ష్మీకాంతరెడ్డి, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

## పిల్లల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకే క్విజ్ పోటీలు

**ఆర్‌డిటి డైరెక్టర్ విశాల ఫెర్రర్**

బహుములు ప్రదానం చేస్తున్న ఆర్‌డిటి డైరెక్టర్ విశాల ఫెర్రర్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

పిల్లల్లో దాగిఉన్న సృజనాత్మకను వెలికి తీయడానికి క్విజ్ పోటీలు ఎంతో దోహదపడతాయని ఆర్‌డిటి మహిళా సాధికార డైరెక్టర్ విశాల ఫెర్రర్ అన్నారు. గురువారం ఆర్‌డిటి ఆడిటోరియంలో ఆర్‌డిటి సెంట్రల్ లెవల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆర్‌డిటి మహిళా సాధికార డైరెక్టర్ విశాల ఫెర్రర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి క్విజ్ పోటీలను ప్రారంభించారు. పిల్లల్లో ఇప్పటి నుంచే పోటీతత్వాన్ని అలవర్చేందుకు క్విజ్ పోటీలు ఉపయుక్తంగా నిలిచాయని తెలిపారు. స్పాంటినెస్‌గా ప్రశ్నలకు పిల్లలు జవాబులు చెబుతుండటం అభినందనీయం అన్నారు. చదువుతో పాటు ఆట పాటలు, ఇలాంటి పోటీలు పిల్లలకు ఎంతో అవసరం అన్నారు. ఆర్‌డిటి పిల్లల విద్యాభివృద్ధికి దోహదపడే అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఆర్‌డిటి స్కూల్, ప్రభుత్వ పాఠశాలలు, ఆర్‌డిటి స్పాన్సర్ షిప్ కలిగిన 4, 5వ తరగతులు చదువుతున్న విద్యార్థులు క్లస్టర్, ఏరియా స్థాయి క్విజ్ పోటీలో విజేతలు సెంట్రల్ స్థాయి క్విజ్ పోటీల్లో పాల్గొన్నారు. తెలుగు, మ్యాథ్స్, సైన్స్, జనరల్ నాలెడ్జ్ వంటి అంశాలపై పిల్లలకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆర్‌డిటి మహిళా సాధికార డైరెక్టర్ విశాల ఫెర్రర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిటి ఎడ్యుకేషన్ డైరెక్టర్ మోహన్‌మురళి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్మాపురం గ్రామంలో ఆంజనేయులు కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం చెక్కును నారా భువనేశ్వరి

## ఓటుతో వైసిపికి బుద్ధి చెబుదాం

**నారా భువనేశ్వరి**

**ప్రజాశక్తి-గుత్తి**

ఐదేళ్లుగా ప్రజా వ్యతిరేక పాలనను సాగిస్తూ అన్ని విధాలా ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టేసిన వైసిపి పాలనకు వచ్చే ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెబుదామని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. నిజం గెలవాలి పేరుతో ఆమె చేపట్టిన కార్యక్రమం అనంతపురం జిల్లాలో గురువారం 2వ రోజు కొనసాగింది. గుత్తి మండలం ధర్మాపురం గ్రామంలోని టిడిపి నాయకుడు, ఉప సర్పంచి ఎం.ఆంజనేయులు కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బేతాపల్లి గ్రామంలో పర్యటించారు. యంగన్నపల్లిలో సర్పంచి భరత్ కుమార్ ఆధ్వర్యంలో మహిళలు భువనేశ్వరికి ఘన స్వాగతం పలికారు. బేతాపల్లి గ్రామంలో మతి చెందిన జయమ్మ ఇంటికెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మతుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు కడుపునిండా తిండి పెట్టాలనే ఉద్దేశంతో చంద్రబాబు నాయుడు అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేశారని చెప్పారు. వైసిపి ప్రభుత్వం వీటిని తీసివేసి పేదల నోటి దగ్గర కూడు లాగేసిందన్నారు. మహిళాభివృద్ధికి టిడిపి అనేక విధాలుగా సాయం అందించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రాగానే మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేయనున్నట్లు చెప్పారు. తల్లీచెల్లికి న్యాయం చేయని జగన్ తెలుగుతల్లికి ఏం న్యాయం చేస్తాడని ఆమె ఎద్దేవా చేశారు. చంద్రబాబు నాయుడుతోనే సుపరిపాలన సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్, వెంకట శివుడు యాదవ్, హిమబిందు, టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు అబ్దుల్ జిలాన్, ఎంపీటీసీ ధనుంజయ, టిడిపి మండల, పట్టణ కన్వీనర్లు బర్థివలి, రవిగౌడ్, ధర్మతేజ గౌడ్, పవన్ గౌడ్, అనిల్ గౌడ్, శ్రీనివాస చౌదరి, శ్రీనివాస్ యాదవ్, దిల్కాశీనా, ఎంకె.చౌదరి, శ్రీకాంత్ చౌదరి, గోరంట్ల నాగరాజు, సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన రాకెట్ల మధుసూదన్‌రెడ్డి

**ప్రజాశక్తి-ఉరవకొండ**

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి సోదరుడు రాకెట్ల వై.మధుసూదన్‌రెడ్డి వైసిపిలో చేరారు. ఈమేరకు గురువారం విజయవాడలో పిసిసి అధ్యక్షురాలు షర్మిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. గతంలో ఈయన వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. మధుసూదన్‌రెడ్డి చేరికతో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుందని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తెలిపారు.

షర్మిల సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్న రాకెట్ల మధుసూదన్‌రెడ్డి

## రోగులకు అందుబాటులో ఉండాలి

**గార్లదిన్నె :** గ్రామ పంచాయతీల్లోని విలేజ్ హెల్త్ సెంటర్లలో ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని మండల వైద్యాధికారిణి గౌతమి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలకు ఈఆశా యాప్ అప్డేట్ చేయడం, కౌమార బాలికలకు రక్తహీనత నివారణకు హిమోగ్లోబిన్ టెస్ట్ చేయడం, ఐరన్ ఫోలిక్ మాత్రలు వేయడం, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దిలీప్‌కుమార్, మంజుల, పద్మావతి, సిహెచ్ఒ లోకనాథ్, ఆరోగ్య విస్తరణాధికారి నాగేశ్వరయ్య, పిహెచ్ ఎన్ అరుణ, సూపర్‌వైజర్లు, సూర్యకళ, కృష్ణమోహన్, విశ్వనాథ్, గాయత్రి, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**బొమ్మనహాళ్ :** మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వసుపత్రిలో సిబిడియు ఆధ్వ ర్యంలో పిహెచ్ఎన్ శ్రీలక్ష్మి 'ధీర' అనే ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు గ్రామ నుంచి మండలం, జిల్లా, రాష్ట్ర, దేశ స్థాయిలో ఎంతో ప్రగతి సాధించారన్నారు. కార్యక్రమంలో నర్సులు, సూపర్వైజర్లు, మహిళా ఉద్యోగులు, సిబిడియు నాయకులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు

## కొనసాగిన యువచైతన్యయాత్ర

జెసికి గొర్రెపిల్లను బహూకరిస్తున్న ప్రజలు

**తాడిపత్రి రూరల్ :** మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి చేపట్టిన యువ చైతన్య యాత్ర గురువారం మండల పరిధిలోని అక్కన్నపల్లి, హుసేనాపురం, వీరాపురం, బొందలదిన్నె గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రభాకర్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయా గ్రామ ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## 'పది' విద్యార్థులకు పరీక్షలపై అవగాహన

**బెలుగుప్ప :** పదో తరగతి పరీక్షలపై యూత్ ఆర్బిట్ ఆర్గనైజర్ వ్యవస్థాపకులు శిర్పి చంద్రశేఖర్ గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి, ఏ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి అనే అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో యూత్ ఆర్బిట్ సభ్యులు అమర్నాథ్, గణేష్, రాయలసీమ విద్యావంతుల కమిటీ వ్యవస్థాపకులు వెంకటేష్, అనంతపురం హక్కుల కమిటీ సభ్యులు రాహుల్, జనసేన మండల అధ్యక్షులు సుధీర్, ఐక్య జిల్లా కార్యదర్శి సభ్యుడు చందు, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి సభ్యులు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## జెఎన్‌టియు ఎమ్మెస్సీ ఫలితాలు విడుదల

**అనంతపురం :** జెఎన్‌టియు అనంతపురం పరిధిలో గత ఫిబ్రవరిలో నిర్వహించిన ఎంఎస్సీ 1వ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు, ఎంఎస్సీ 3వ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను గురువారం విడుదల చేశారు. పరీక్ష ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ www.jntua.ac.in ను సంప్రదించాలని కోరారు.

## లేఖల పంపిణీ విధానాలపై అవగాహన

**బెలుగుప్ప :** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లకు ముఖ్యమంత్రి లేఖల పంపిణీ కార్యక్రమం విధి విధానాలు, సూచనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి దామోదరయ్య, డిజిటల్ అసిస్టెంట్లు జీవన్‌కృష్ణ, సంజీవరాయుడు, మురళి, హారిక, విమల, రూప్సిని, చంద్రమోహన్‌రాజు, ఉపేంద్ర, రవికుమార్, అక్రం బాషా, గంగేశ్వర్, రాజేష్, రాధ, జగదీశ్వర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## తాడిపత్రిలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

**తాడిపత్రి రూరల్ :** పట్టణంలోని 2వ వార్డులో 'బాబు షూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జెసి అస్మిత్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జనసేన, నాయకులు, కార్యకర్తలు, జెసి అనుచరులు, అభిమానులు పాల్గొన్నారు.

## కార్పెంటర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

పత్రం అందజేస్తున్న యువనేత ప్రణయ్‌రెడ్డి

**ఉరవకొండ :** కార్పెంటర్ల (వడ్రంగి) కార్మిక సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి వై.ప్రణయ్‌రెడ్డి తెలిపారు. ఉరవకొండలో కార్పెంటర్ల అసోసియేషన్ కార్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయించినందుకు గురువారం ప్రత్యేక కృతజ్ఞత సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రణయ్‌రెడ్డి మాట్లాడుతూ కార్పెంటర్ల అసోసియేషన్ ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లలిత, వైసిపి నాయకులు బసవరాజు, ఏసీ ఎర్రిస్వామి, ఓబన్న, ఆసిఫ్, షాహనాజ్, వాసు, శర్మస్, మల్లికార్జున, కార్పెంటర్ల సంఘం నాయకులు ఎస్.మహబూబ్‌బాషా, తిమ్మరాజు, కొత్తకోట అబ్దుల్‌రహిమాన్, అబ్దుల్, రాజు ఆచారి, శ్రీనివాసులు, బసవరాజు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలి

**అనంతపురం :** కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం అనంతపురంలోని పికెకె ఇన్స్టిట్యూట్ ఆఫ్ బెల్లాంజీ హాల్లో 'ఓటు వేసి రక్షించుకుందాం.. ప్రజాస్వామ్యాన్ని గెలిపించుకుందాం' అనే అంశంపై రాష్ట్రస్థాయి కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు మేరకు వాలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలన్నారు. అలాగే రాయలసీమ అభివృద్ధి, నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తి, ఉపాధి కల్పన కోసం కృషి చేసే నేతలను ఎన్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఛైర్మన్ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ జి.భవానీప్రసాద్, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ప్రధాన కార్యదర్శి పూర్వ రాష్ట్ర ఎన్నికల అధికారి డాక్టర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మా–డీ కోర్సుకు పెరిగిన ప్రాధాన్యత

**అనంతపురం :** ప్రపంచవ్యాప్తంగా ఫార్మా–డీ కోర్సుకు ప్రాధాన్యత పెరిగిందని జెఎన్‌టియు ఉపకులపతి జివిఆర్ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం జెఎన్‌టియు అనంతపురం ఓటిఆర్ఐ ప్రాంగణంలో 2023–24వ బ్యాచ్ ఫార్మా–డి విద్యార్థుల స్వాగతోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఫార్మా–డి కోర్సుకు ఎంతో విశిష్ట ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా వైద్యులుగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఇందులో భాగంగా ఔషధ శాస్త్రంలో కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసం ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, ఓటిఆర్ఐ డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.గోపినాథ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.రాంప్రసాద్‌రెడ్డి, ఫార్మా.డి. విభాగాధిపతి ఇ.పవన్‌కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నిరంగాల్లో రాణిస్తున్న మహిళలు

**ప్రజాశక్తి-అనంతపురం**

మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణిస్తున్నారని జెఎన్‌టియు ఉపకులపతి జివిఆర్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ ఆడిటోరియంలో వర్శిటీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టరేట్, జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జెఎన్‌టియు మహిళా సాధికారత విభాగం డైరెక్టర్ వి.బి.చిత్ర అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రతిరంగంలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి, వారి హక్కులు గురించి మహిళలకు అవగాహన కల్పించడానికే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు వివరించారు. మహిళలు క్రీడా, సైనికరంగాల్లో భాగస్వాములు కూడా అవుతున్నారన్నారు. మహిళలు వారికి కేటాయించిన ఏ పనినైనా సక్రమంగా నిబద్ధతతో నిర్వహిస్తారని తెలిపారు రెక్టార్ ఎం.విజయకుమార్ మాట్లాడుతూ మహిళలు దేశాభివృద్ధిలో పురుషులతోపాటు సమానంగా సహాయ పడుతున్నారన్నారు. శ్రీసత్యసాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ డైరెక్టర్ ఎన్.శ్రీవిద్య అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం బోధన, బోధనేతర సిబ్బందికి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, హ్యుమానిటీస్, సోషియల్ సైన్సెస్ శ్రీసత్యసాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ డీన్ గీతాబాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, జి.వి.సుబ్బారెడ్డి, పి.సుజాత, పద్మ సువర్ణ, పి.ఆర్.భానుమూర్తి, టి.నారాయణరెడ్డి, భువనవిజయ, ఎస్.వసుంధర, కె.మాధవి, విశాలి గోర్పడే, ప్రశాంతి, కే.యఫ్.భారతి, ఎ.పి.శివకుమార్, దిలీప్‌కుమార్, ఎం.రామశేఖర్‌రెడ్డి, అరుణ మస్తాని, అరుణ, శైలాకుమారి, జి.మమత, కళ్యాణి రాధా, శారద, మాజీ ఆచార్యులు వి.శంకర్, నీరజ, జసిక సరిత, తదితరులు పాల్గొన్నారు.

**అనంతపురం :** మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్య కళాశాల సిబ్బంది నగరంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పెద్దాసుపత్రి నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రభుత్వ వైద్య కళాశాల వరకూ సాగింది. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్ఆర్ యూనివర్శిటీ వైస్‌ఛాన్స్‌లర్ కె.బాబ్జి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు మహిళా సాధికారపై నిర్వహించిన వ్యాసరచన, పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు హేమలత, పద్మజ, సరళ, ఇందిర, లక్ష్మి, పద్మశ్రీ, సుచిత్ర, రేణుక, ప్రవీణ, పార్వతి, సునీత, విజయకుమారి, నీలిమ, రమాబాయి, సుమనా, గోపీచంద్, పద్మాబాయి, నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని, మంజుల, యశోద, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ స్టాఫ్ పాల్గొన్నారు.

**మహిళా దినోత్సవంలో జెఎన్‌టియు విసి శ్రీనివాసరావు**

కార్యక్రమంలో మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి శ్రీనివాసరావు

అనంతపురం ఆర్టీసీ కార్యాలయంలో మాట్లాడుతున్న వక్తలు

**అన్నిరంగాల్లో మహిళా శక్తి చాటాలి**

మహిళలు అన్నిరంగాల్లో మహిళా శక్తిని చాటాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. లక్ష్మీనారాయణ మహిళా డెవలప్‌మెంట్ సొసైటీ, రాయలసీమ బలిజ మహిళా సంఘం ఆధ్వర్యంలో గురువారం నగరంలోని బాలాజీ కళ్యాణ మండపంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకులు శంకరయ్య, రాయలసీమ బలిజ మహిళా సంఘం అధ్యక్షురాలు పద్మజ, రాయలసీమ బలిజ మహాసంఘం మాజీ అధ్యక్షులు పామురాయి వెంకటేష్, యువజన అధ్యక్షులు రమేష్, రాయలసీమ బలిజ మహిళా సంఘం నేతలు భారతి, దేవి, శంకరమ్మ, కృష్ణవేణి, నీరజ, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే ఆర్టీసీ ప్రాంతీయ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ డిపోల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగుల సేవలను గుర్తిస్తూ ప్రశంసాపత్రాలతోపాటు నగదు బహుమతులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ప్రాంతీయ అధికారి సుమంత్ ఆర్ ఆధోని, ఆర్టీసీ జోనల్ ఛైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, డిఎంఅండ్‌హెచ్ఒ దేవి, అడ్వకేట్ పద్మ నారాయణరెడ్డి, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పి.రమేష్‌బాబు, లా ఆఫీసర్ చంద్రశేఖర, అకౌంట్స్ ఆఫీసర్ లక్ష్మీదేవి, పర్సనల్ ఆఫీసర్ డి.చంద్రాయుడు, అనంతపురం డిపో మేనేజర్ నాగభూపాల్, తదితరులు పాల్గొన్నారు.

**గుత్తి :** మండల పరిధిలోని బేతాపల్లిలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మహాలక్ష్మి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రొద్దుటూరుకు చెందిన సాఫ్ట్ వేర్ ఇంజనీర్ జోసెఫ్ కీర్తి ప్రకాశ్ బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓబులపతి, శివ ప్రసాద్, సాధన, రవీంద్రనాథ్ రెడ్డి, నరేంద్ర, సుజాత, చంద్రకళ, నిరుపమ, రామకష్ణయ్య, రత్నకుమారి, మాదన్న తదితరులు పాల్గొన్నారు.

## అడ్డంకులు ఎదురైనా ఆసుపత్రిని పూర్తి చేశాం

### ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

**ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్**

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిలో వంద పడకల ఆసుపత్రికి ఎన్ని అడ్డంకులు ఎదురైనా పూర్తి చేసి ప్రారంభించామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన 100 పడకల ఆసుపత్రికి ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా కార్యకర్తలతో కలిసి పట్టనంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో ఉన్న వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం వంద పడకల ఆసుపత్రి వరకూ ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిపత్రికి వంద పడకల ఆసుపత్రి కలగా ఉండేదన్నారు. కానీ వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత సిఎం జగన్ చొరవతో ఆసుపత్రి పూర్తి చేసి ప్రారంభించామన్నారు. ఈ ఆసుపత్రికి నిర్మాణానికి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి అడుగడుగునా అడ్డు తగిలాడని ఆరోపించారు. దీంతోపాటు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ భవనం, జూనియర్ కళాశాల మైదానం ప్రహరీ, ఆర్టీవో కార్యాలయ తదితర నిర్మాణాలకు అడ్డుపడి కోర్టు నుంచి స్టే తెచ్చారన్నారు. తాడిపత్రిలో గత పాలకులు చేయలేని అభివృద్ధిని ఐదేళ్లలో చేసి చూపించామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలపై సంబరాలు

**ఉరవకొండ :** సిఎం జగన్ ఇన్‌పుట్ సబ్సిడీ నిధులు విడుదల చేయడంతో మండలంలోని రాకెట్ల గ్రామంలో రైతులు గురువారం సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ రైతులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే రైతుల ఖాతాల్లో పంటనష్ట పరిహారం (ఇన్పుట్ సబ్సిడీ) జమ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, తేజోనాథ్, ఆశోక్‌కుమార్, వెంకటేసులు, శివమ్మ, వంశీ, శ్రీరాములు, సిద్దార్థ్, వన్నప్ప, ఆమిద్యాల వెంకటేష్, నాగప్ప, నాగరాజు, సీనానాయక్, ఈడిగ బాబు, సాలమ్మ, చంద్రానాయక్, రవి, ఓంప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

కాగా విడపనకల్ మండలవ్యాప్తంగా రైతన్నలు సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా ఆర్‌బికె, సచివాలయాల్లో సిఎం జగన్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ కరణం పుష్పావతి భీమిరెడ్డి, నాయకులు సుశీల, ఓబులేష్, కరణం భీమిరెడ్డి, సుంకన్న, ప్రసాద్, అశోక్‌రెడ్డి, హంపయ్య, మాధవరెడ్డి, సురేష్‌యాదవ్, వెంకటరెడ్డి, గొల్ల ఎర్రిస్వామి, వడ్డేగేరి రామాంజనేయులు, మల్లికార్జున, లింగయ్యస్వామి, శంకర్‌గౌడ్, మాల్య అశోక్, తలారి మహేష్, సచివాలయ కన్వీనర్ నాగరాజ్, రైతులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళిపై అవగాహన అవసరం:ఆర్‌డిఒ

**ప్రజాశక్తి-గుంతకల్లు**

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల నియమావళిపై అవగాహన కలిగి ఉండాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్‌డిఒ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో ఎన్నికల నియమావళిపై రాజకీయ పార్టీ నాయకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూలు నిలబడిన వెంటనే కోడ్ అమల్లోకి వస్తుందన్నారు. ఆ సమయం నుండి రాజకీయ పార్టీలు పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల కోడ్ పరిధిలోకి వస్తారన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పై రాజకీయ పార్టీలు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పని సరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికల నిబంధనలను అతిక్రమించరాదని సూచించారు. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ చాలా ముఖ్యమైనదని పోటీలోని అభ్యర్థులు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నామినేషన్లు వేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గంలోని తహాశీల్దార్లు శేషఫణి, భారతి, చంద్రశేఖర్‌నాయక్, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరాపై అప్రమత్తత : కమిషనర్

మోటార్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మేఘస్వరూప్

**అనంతపురం కార్పొరేషన్ :** ప్రజలకు రక్షిత మంచినీరు అందించే విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ మేఘస్వరూప్ సూచించారు. నగరానికి తాగునీరు అందించే పిఎబిఆర్ డ్యామ్‌లో స్టాండ్ బై మోటార్ (మూడవ మోటార్) అమర్చిన తర్వాత మోటారు పనితీరును కమిషనర్ గురువారం పరిశీలించారు. అలాగే ముద్దలాపురం ఫిల్టరేషన్ ప్లాంట్‌లో నీటి శుద్ధి ప్రక్రియ, అమృత్ పథకం కింద క్రొత్తగా నిర్మించిన 16 ఎంఎల్‌డి సామర్థ్యం ఉన్న ఫిల్టరేషన్ ప్లాంట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోటార్లు, విద్యుత్ సరఫరా విషయాల్లో నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు పవర్ ఫాక్టర్ రీడింగ్‌ను రికార్డులో నమోదు చేస్తూ 24 గంటలూ పర్యవేక్షిస్తూ ఉండాలని ఆదేశించారు. గతనెలలో ఏర్పడిన నీటి కొరత పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఎస్ఇ రామ్మోహన్‌రెడ్డి, ఇఇ సూర్యనారాయణ, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన

వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న నాయకులు

**ఆత్మకూరు :** మండల కేంద్రంలో వాల్మీకి సంఘం కమిటీ ఏర్పాటు చేసిన మహర్షి వాల్మీకి విగ్రహాన్ని గురువారం ప్రతిష్టించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, హిందూపురం వైసిపి ఎంపి అభ్యర్థి బోయ శాంతమ్మ వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాముని చరిత్రను ప్రపంచానికి పరిచయం చేసిన వాల్మీకి మహర్షి అన్నియుగాల్లో పూజనీయుడు అన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని వాల్మీకులు అన్నిరంగాల్లో ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో వైసిపి నాయకులు మధుసూదన్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## పైప్‌లైన్ పనుల పరిశీలన

**ఆత్మకూరు :** నియోజకవర్గవ్యాప్తంగా శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కారం దిశగా చేపట్టిన పైప్‌లైన్ పనులను గురువారం ఆత్మకూరు సమీపంలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిఎం జగన్ చేపట్టిన పాదయాత్రలో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు శాశ్వతంగా తాగునీటి సమస్య తీర్చేందుకు రూ.117 కోట్లతో పైపులైన్ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే శాశ్వతంగా నీటి సమస్య తీరుతుందన్నారు.

## ఇంటింటి చెత్త సేకరణ

చెత్తసేకరణ వివరాలను అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ మేఘస్వరూప్

**అనంతపురం కార్పొరేషన్ :** నగరంలోని శాంతినగర్, గౌరవ్ గార్డెన్స్, ఆజాద్‌నగర్, 5, 6 రోడ్లు, హనుమాన్ కాలనీ పరిసర ప్రాంతాల్లో క్లాప్ ఆటోల ద్వారా చేపడుతున్న ఇంటింటి చెత్త సేకరణను కమిషనర్ మేఘస్వరూప్ గురువారం పరిశీలించారు. ఇందులో భాగంగా మురికి కాలువలు వ్యర్థాలతో నిండి మురుగు ముందుకు కదలకుండా ఉండటానికి గుర్తించి గ్యాంగ్‌వర్కులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అన్నిప్రధాన కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను యుద్ధ ప్రాతిపదికన తొలగించి నీటి పారుదలకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. గ్యాంగ్‌వర్క్ చేపడుతున్న సమయంలో కాలువ ఒడ్డున పేరుకుపోయే చెత్త, వ్యర్థాలను ఎప్పటికప్పుడు పూర్తిస్థాయిలో తొలగించి శుభ్రం చేయాలన్నారు. ప్రతి పారిశుధ్య కార్మికుడూ చేతి తొడుగులు, బూట్లను తప్పని సరిగా వాడాలని సూచించారు.

## మహిళా కానిస్టేబుల్‌కు సన్మానం

**అనంతపురం క్రైం :** జాతీయ పోలీసు క్రీడల్లో సిల్వర్ పతకం సాధించిన మహిళా కానిస్టేబుల్ దీపను ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ గురువారం అభినందించి సత్కరించారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరిగిన జాతీయ పోలీసు క్రీడల్లో యోగా విభాగంలో జిల్లా నుంచి రూరల్ పోలీస్ స్టేషన్ మహిళా పోలీసు కానిస్టేబుల్ దీప విశాఖపట్నం, దిశా పోలీస్‌స్టేషన్ సి.ఐ కళ్యాణితో కలిసి రిథమిక పెయిర్ యోగాసనాలు వేసి ప్రతిభ కనబరిచి సిల్వర్ పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ దీపను అభినందించి సత్కరించారు. అంతేగాకుండా దీపకు పోలీసు శాఖ తరపున రూ.2 లక్షల నగదు రివార్డు, రెండు ఇంక్రిమెంట్లు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఎస్.లక్ష్మీనారాయణరెడ్డి, ఏఆర్ డీఎస్పీ మునిరాజ పాల్గొన్నారు.

## జనసేన నాయకులపై కక్షసాధింపు తగదు

విలేకరులతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

**అనంతపురం :** ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ జనసేన–టిడిపి కూటమిని ఎదుర్కోలేక వైసిపి కక్ష సాధింపులకు పాల్పడుతోందని జనసేన నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర ఆరోపించారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మంగళగిరిలో జనసేన సిబ్బంది నివసించే అపార్ట్‌మెంట్లకు పోలీసులు వెళ్లి భయభ్రాంతులకు గురి చేసే విధంగా గదులను తనిఖీ చేయడం బాధాకరమనానరు. వైసిపి కండువా కప్పుకున్నట్టుగా వ్యవహరిస్తున్న పోలీసులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు జయమ్మ, నాయకులు ఎస్.నజీర్, మేదర వెంకటేష్, రోళ్ల భాస్కర్, హుస్సేన్, దరాజ్ బాషా, అంజి, ఆకుల అశోక్, వీరమహిళలు అనసూయ, దాసరి సరిత, నాయకులు హిద్దు, విజయ్ రాయల్, హరి, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

### గాయపడిన వాలంటీర్ మృతి

కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

**అనంతపురం :** ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వారంరోజులుగా మృత్యువుతో పోరాడిన రాప్తాడు మండలం హంపాపురం వాలంటీర్ కల్యాణి గురువారం అనంతపురం సర్వజన ఆసుపత్రిలో పరిస్థితి విషమించి మృతిచెందింది. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ ఆసుపత్రికి చేరుకుని మృతదేహానికి నివాళు ర్పించారు. ఈసందర్భంగా వారు వారు మాట్లాడుతూ రాప్తాడు మండలం హంపాపురం గ్రామంలో వాలంటీర్ చేసిన సేవలను గుర్తించి 'సేవా వజ్ర' అవార్డును ప్రదానం చేసినట్లు గుర్తు చేశారు. అలాంటి వాలంటీర్ కళ్యాణి అకాల మరణం పొందడం బాధాకరమన్నారు. నివాళులర్పించిన వారిలో వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యులు జి.కేశవరెడ్డి, తదితరులు ఉన్నారు.

### అరటి తోటకు నిప్పు

**నార్పల :** మండల పరిధిలోని రంగాపురం గ్రామానికి చెందిన లక్ష్మీదేవికి చెందిన అరటి తోటకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో తోటలోని డ్రిప్పు పరికరాలు అరటి తోట దగ్ధమయ్యాయి. ఫలితంగా రూ.లక్ష వరకూ నష్టం జరిగి ఉంటుందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేసింది. విషయంత తెలుసుకున్న ఏఎస్ఐ ఈశ్వరయ్య కానిస్టేబుల్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని యథాస్థానంలో ఏర్పాటు చేయాలి

**రాయదుర్గం :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం పట్టణంలో దుస్థితిలో ఉందని, దీని ని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం విచారకరం అని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే అభ్యర్థి చిందనూరు నాగరాజు పేర్కొన్నారు. పట్టణంలో గురువారం ఆయన మాట్లా డుతూ గతంలో టవర్ క్లాక్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించి మొలకాల్మూర్ రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో ఉంచారు. రోడ్డు విస్తరణ అనంతరం గాంధీ, వాల్మీకి విగ్రహా లను అదే స్థానంలో ఏర్పాటు చేయగా, అంబేద్కర్ విగ్రహాన్ని అలాగే వదిలేశారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అంబేద్కర్ విగ్రహాన్ని యథాస్థానంలో ఏర్పాటు చేయాలని లేనిచో ఆందో ళనలు చేపడుతామని నాగరాజు హెచ్చరించారు.

## నూతన రథం నిర్మాణానికి శ్రీకారం

**ఉరవకొండ :** మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నఅహోబిలం లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రంలో కూలిపోయిన పాతరథం స్థానంలో కొత్త రథం నిర్మాణ పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా తెల్లవారుజాము నుంచే ఆలయ తూర్పు ప్రాంగణంలో వైదిక, హోమాలు నిర్వహించారు. ఉదయం మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ఆలయ ఈఓ విజయ్‌కుమార్, అర్చకులు ద్వారాకానాథ్, బాలాజీ తదితరులు ప్రత్యేక పూజలు చేసి రథ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నరసింహులు, వైస్ ఎంపిపి శ్రీనాథ్‌రెడ్డి, నాయకులు పార్వతమ్మ, తేజోనాథ్, ఆశోక్‌కుమార్, చంద్రమ్మ, శ్రీరాములు, వెంకటరెడ్డి, లలిత, బసవరాజు, ఆమిద్యాల రాజేష్, ముష్టూరు బాబు, జల్లిపల్లి సిద్దారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఉదయ్‌రెడ్డి, వెంకటేసులు, నాగప్ప, మల్లప్ప, నీలప్ప, రాకెట్ల రమేష్, ఆలయ సిబ్బంది మారుతీప్రసాద్, దీపక్, రామకష్ణ, ప్రకాష్, అర్చకులు గుండురావు, రామకృష్ణారావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లు విడుదల

**ఉరవకొండ :** ఈనెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్న పట్టణంలోని గవిమఠం స్థిత చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్రస్వామి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకూ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదోని చౌకిమఠం పీఠాధిపతి కల్యాణిస్వామి, సిద్ధగంగ శాఖ మఠం పీఠాధిపతి చెన్నబసవస్వామి, గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, మఠం ఉద్యోగులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు

**ఆత్మకూరు :** మండల పరిధిలోని బి.యాలేరులో ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ముందుగా సీజనల్ వ్యాధులపై ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వై.మధుసూదనరెడ్డి, సర్పంచి రేణుక, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, అధ్యాపకులు నరహరి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఎస్.పురుషోత్తం, జి.ఆనంద్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

**ఉరవకొండ :** ఉరవకొండలో అనారోగ్యాలతో బాధపడుతున్న పలు కుటుంబాలకు పయ్యావుల శ్రీనివాసులు గురువారం ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాదినేని రామాంజనేయులు, ప్యారం కేశవానంద, రాజేష్, కౌకుంట్ల రవి, వరప్రసాద్, రామాంజనేయులు, సాకే మల్లికార్జున, రాయంపల్లి గోవిందు, రాయంపల్లి వెంకటేశులు, చినమాదుల రామకృష్ణ, మీనుగ రవివర్మ, తదితరులు పాల్గొన్నారు.

## శివరాత్రికి ముస్తాబైన శివాలయం

**నార్పల :** శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని శివాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఇందులో భాగంగా నూతన రంగులు వేయడంతోపాటు రంగురంగుల విద్యుత్ కాంతులతో ఆలయాన్ని అలంకరించారు. కాగా శుక్రవారం శివరాత్రి సందర్భంగా ఆలయ ఆవరణలో హరికథ పారాయణంతోపాటు రాత్రి శివపార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

## కౌన్సిలర్ సొంత ఖర్చుతో తాగునీటి సరఫరా


తాగునీరు అందిస్తున్న మధుసూదన్‌రెడ్డి

**గుత్తి :** మున్సిపాలిటీ పరిధిలోని 19 వ వార్డులో నెలకొన్న తాగునీటి సమస్యను కౌన్సిలర్ కె.సుచరిత, వైసిపి జిల్లా నాయకులు, మణికంఠ మెటల్ స్టోన్ క్రషర్ అధినేత కె.మధుసూదన్‌రెడ్డి సొంత నిధులతో పరిష్కరించారు. ఇందులో భాగంగా వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. దీంతో ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు డి.భాస్కర్‌రెడ్డి, వార్డు వాలంటీర్ లాలు, తదితరులు పాల్గొన్నారు.

## పలువురు వైసిపిలో చేరిక

**రాయదుర్గం :** మండలంలోని పల్లేపల్లి గ్రామానికి చెందిన 21 కుటుంబాలు గురువారం పట్టణంలోని నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి నివాసం వద్ద వైసిపిలో చేరాయి. పల్లేపల్లి గ్రామానికి చెందిన వాసుదేవరెడ్డి, మరో 20 టిడిపి కుటుంబాలు వైసిపి రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరాయి. వారికి మెట్టు వైసిపి కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. మెట్టు, గౌని ఆయన మాట్లాడుతూ జగన్ నాయకత్వం పట్ల నమ్మకంతో ప్రజలు వైసిపిలో చేరుతున్నారని తెలిపారు.

## ఆసుపత్రి అభివృద్ధి సలహా కమిటీ సమావేశం

**రాయదుర్గం :** పట్టణంలోని ఆసుపత్రిలో గురువారం ప్రాంతీయ ఆసుపత్రి అభివృద్ధి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సమావేశంలో పాల్గొన్నారు. బడ్జెట్ కేటాయింపులను పరిశీలించారు. ఆసుపత్రి త్రైమాసిక బడ్జెట్‌ను ఆమోదించారు. సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, కమిటీ సభ్యులు సుజాత, జ్ఞానేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.